7

సాక్షి బాపట్ల

1

గురువారం । 2 । అక్టోబర్ । 2025



న్యూస్‌రీల్

ఫోన్‌పేలో రూ. 5 లక్షల వరకు విద్యుత్ బిల్లు చెల్లింపు

ప్రత్తిపాడు: విద్యుత్ వినియోగదారులు రూ. 5 లక్షల వరకు ఫోన్‌పేలో తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని గుంటూరు రూరల్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బి.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించడం, బ్యాంక్‌లో చెక్కులు డిపాజిట్ చేయడంతో ఒకటి రెండు రోజులు ఆలస్యమయ్యేవని గుర్తుచేశారు. తద్వారా వినియోగదారుకు సర్‌చార్జీలు పడేవని తెలిపారు. సర్‌ఛార్జీలను బిల్లు ఇచ్చిన పదిహేను రోజుల్లోపు చెల్లిస్తే తరువాతి బిల్లులో రూ.150 వరకు కేటగిరీ–2 వినియోగదారులకు లాభం చేకూరుతుందన్నారు. ఇక నుంచి వినియోగదారులు ఫోన్‌పే ద్వారా ఇన్‌టైంలో విద్యుత్ బిల్లులను రూ.లక్ష నుంచి రూ. ఐదు లక్షల వరకు చెల్లించవచ్చన్నారు. తద్వారా వినియోగదారులకు సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక వార్డు



గుంటూరు మెడికల్: ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవంలో భాగంగా బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డును జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ప్రారంభించారు. ఆసుపత్రిలోని కుటుంబ నియంత్రణ విభాగంలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు 15 పడకలతో జెరియాట్రిక్ వార్డును ఏర్పాటు చేశారు. డెంటల్ విభాగంలో రూ.1.20 లక్షలతో ఏర్పాటు చేసిన రేడియో విజియోగ్రఫీ ఎక్స్‌రే యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను, వార్డుల్లో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు.

సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. గుంటూరు జిల్లా జైలులో ఉన్న సోషల్ మీడియా కార్యకర్త వజ్రాల తారక ప్రతాప్‌రెడ్డిని బుధవారం ములాఖత్ ద్వారా ఆయన కలసి భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సోషల్ మీడియా యాక్టివిస్టులపై అడ్డగోలుగా కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ఎటువంటి పోస్టులు చేయకపోయినా పార్టీలో చురుగ్గా ఉన్న వారిపై కూడా పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయించి, రాష్ట్రవ్యాప్తంగా అనేక మందిని జైళ్లకు పంపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు నమోదుకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన గాంధీ విగ్రహం సిద్ధం



తెనాలి: మహాత్మ గాంధీ 156వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ గాంధీ హిల్‌లో ఆవిష్కరించేందుకు ధ్యాన గాంధీ విగ్రహం స్థానిక సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంది. పది అడుగుల ఎత్తుతో తయారు చేసిన ఈ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు శిల్పులు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయోస్తు



గోవాడ బాల కోటేశ్వర ఆలయంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు



రేపల్లె పట్టణంలో మహిషాసురమర్దనిగా కొలువుదీరిన బూరుగులమ్మ



చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో అమ్మవారికి మహిషాసురమర్దని అలంకరణ



మహిషాసురమర్దనిగా పూజలందుకున్న చందోలు బగళాముఖి అమ్మవారు



అల్లూరు నరసింహస్వామి ఆలయంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని బుధవారం శ్రీ మహిషాసురమర్దనిగా అలంకరించారు. చందోలు బగళాముఖి అమ్మవారు మహిషారుమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే అల్లూరు గ్రామంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, రేపల్లె పట్టణంలోని బూరుగులమ్మ ఆలయంలో, చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో అమ్మవారు మహిషాసురమర్దనిగా కొలువుదీరారు. – అమర్తలూరు(వేమూరు)/చందోలు (కర్లపాలెం) / వేమూరు/ రేపల్లె

కన్నీటిలోనే లంకలు

- జల దిగ్బంధంలో లంక గ్రామాలు
- అత్యవసర సేవలకు పడవలు ఏర్పాటు
- మూడు రోజులుగా ముంపులోనే పంటలు
- 7,450 ఎకరాలలో వాణిజ్య పంటలకు నష్టం



కొల్లూరు మండలం ఆవులవారిపాలెం - గాజుల్లంక రహదారిపై ఉధృతంగా వరద నీటి ప్రవాహం

కొల్లూరు: కృష్ణమ్మ ప్రకోపానికి లంక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. మూడు రోజులుగా లంక గ్రామాలను వరద తాకిడి వీడకపోవడంతో జలదిగ్బంధంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానికుల అత్యవసర సేవల కోసం మూడు ప్రాంతాలలో అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,53,828 క్యూసెక్కుల నీటిని దిగువకు విడదల చేయగా, సాయంత్రానికి వరద ప్రవాహం తగ్గింది. 5,93,370 క్యూసెక్కుల వద్ద కొనసాగుతోంది. వరద ఉద్ధృతి కొనసాగుతున్న కారణంగా మూడు రోజుల నుంచి వాణిజ్య పంటలు వరద ముంపులో ఉండటంతో ఎందుకూ పనికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. వేలాది ఎకరాలలో ఉద్యాన పంటలను కృష్ణమ్మ ముంచెత్తడంతో రూ. వేల కోట్లలో రైతులు పంట నష్టానికి గురికానున్నారు.

ప్రాథమిక అంచనా ఇదీ..

వరదల కారణంగా వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలు 7,450 ఎకరాలలో నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలకు వచ్చారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని పసుపు, కంద, తమలపాకు, అరటి, జామ, మినుము, కూరగాయలు, పూలు, ఇతర పంటలు 2,980 హెక్టార్లలో ముంపునకు గురైనట్లు ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రూ. వేల కోట్లు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్న వాణిజ్య పంటలు ముంపు బారిన పడటంతో రైతాంగం కోలుకోలేని నష్టానికి గురయ్యారు. చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతర్లంక, పెదలంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, తురకపాలెం, కిష్కిందపాలెం, దోనేపూడి, కొల్లూరు, ఈపూరు, శివరామపురం గ్రామాల పరిధిలోని వాణిజ్య పంటలు ముంపులో చిక్కుకున్నాయి.

ఇంకా జల దిగ్బంధంలోనే..

వరద తీవ్రత కాసత్త తగ్గినప్పటికీ లంక గ్రామాలను చుట్టుముట్టిన నీరు తొలగలేదు. మండలంలోని సుగ్గునలంక, దోనేపూడి చప్టాల పైనుంచి, ఆవులవారిపాలెం – గాజుల్లంక, పోతార్లంక – గాజుల్లంక, భట్టిప్రోలు మండలం వెల్లటూరు కరకట్ట దిగువున రోడ్లపై నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. లంక గ్రామాలు మూడు రోజులుగా చుట్టుముట్టిన వరద నీటి మధ్యనే చిక్కుకొని ఉన్నాయి. సుగ్గునలంక, దోనేపూడి, భట్టిప్రోలు మండలం వెల్లటూరు వద్ద అందుబాటులో ఉంచిన పడవలను అత్యవసర పనుల కోసం ప్రజలు వినియోగించుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. మండంలోని పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం, తురకపాలెం, కిష్కిందపాలెం, తడికలపూడి, గుంటూరుగూడెం, మధ్యగూడెం, జువ్వలపాలెం, శివరామపురం, రావిలంక, గాజుల్లంక వరదలో చిక్కుకున్నాయి.



కొల్లూరు మండలం పెసర్లంక వద్ద గృహాల అంచుల వరకు చేరిన వరద నీరు



సుగ్గునలంక వద్ద రోడ్డుపై వరద నీరు చేరడంతో పడవ సాయంతో ప్రజల రాకపోకలు



కొల్లూరు మండలం ఈపూరు లంక వద్ద వరద నీటిలో మునిగిన అరటి తోట

వైభవంగా చండీకల్యాణం



అమరేశ్వరాలయంలో చండీకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి చండీకల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి, స్వామివారికి ఎదుర్కోల మహోత్సవం జరిగింది. ఆలయంలోని వెంకటాద్రినాయుని మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామివారిని ఉంచి ఆలయ అర్చకులు కౌశిక చంద్రశేఖరశర్మ యాజ్ఞీక పర్యవేక్షణలో అర్చకులు విఘ్నేశ్వర పూజ, రక్షాబంధనం, పుణ్యాహవాచనం, కన్యాదానం, శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ఏటా రెండు సార్లు అనగా మహాశివరాత్రి, దసరాకు కల్యాణం నిర్వహించటం సంప్రదాయమని అర్చకులు పేర్కొన్నారు.

ముంపు ప్రాంతాలలో డాక్టర్ గణేష్ పర్యటన



లంకెవానిదిబ్బ గ్రామంలో వరద ముంపు బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి గణేష్

- పునరావాస కేంద్రాలలో వసతులపై ఆరా
- వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్

రేపల్లె: వరద ముంపు ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుండాలని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ కోరారు. కృష్ణానది వరద ముంపు గ్రామాలను బుధవారం ఆయన సందర్శించారు. లంకెవానిదిబ్బ, పెనుమూడి గ్రామాలలోని పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న వారితో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్, చెరుకుపల్లి కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, దుండి వెంకట రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిమటా బాలాజీ, నాయకులు ఉమాదేవి, చౌటు రమేష్, శొంఠి సురేష్, నాగేశ్వరరావు, సుబ్బారావు, నాగబాబు, వీరనారాయణ, గోపి, తోట శివ, ఖాదర్, ఖాదర్‌వలి, అబ్దుల్ ఖుద్దూష్ తదితరులున్నారు.

గ్రానైట్ లారీల రాకపోకలపై ఆగ్రహం



బల్లికురవ: రహదారి సక్రమంగా లేనందున అభివృద్ధి పరిచే వరకు గ్రానైట్ లారీల రాకపోకలను నిషేధిస్తున్నట్లు బుధవారం సాయంత్రం నక్కబొక్కలపాడు గ్రామస్తులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బల్లికురవ–మార్టూరు ఆర్అండ్‌బీ రోడ్డు బల్లికురవ, నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల మధ్య 6 కిలోమీటర్ల మేర గోతులతో అధ్వాన స్థితికి చేరింది. ఈ గోతుల్లో గ్రానైట్ లారీలు కూరుకుని రోజూ గంటల తరబడి ట్రాఫిక్ జాం అవుతోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నక్కబొక్కలపాడు, పల్లె సమీపంలో గ్రానైట్ లారీ రోడ్డుపై కూరుకుని గంటన్నరపాటు ట్రాఫిక్ జాంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. గోతులు, దుమ్ము ప్రభావంతో అనారోగ్యం బారిన పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోయారు. రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచే వరకు గ్రానైట్ లారీల రాకపోకలను నిషేధిస్తున్నట్లు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపాలు

- రిటైర్డ్ డీఈపై చర్యలు
- పెన్షన్‌లో మూడేళ్లపాటు 15 శాతం కోత

నాదెండ్ల: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతాలోపాలు నిజమని తేలటంతో సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. 2017–18లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు రూ.40 లక్షల పంచాయతీరాజ్ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మించారు. పనులు నాసిరకంగా ఉన్నాయంటూ 2020లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేశాడు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాణాలు పాటించలేదని నిర్ధారించారు. అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా వ్యవహరించిన కేశవరావుకు చార్జ్‌మెమో జారీ చేశారు. కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులో కోత విధించారు. 2024లో కేశవరావు ఉద్యోగ విరమణ చేశారు. తాజాగా కేశవరావుపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పింఛను నుంచి మూడేళ్లపాటు 15 శాతం చొప్పున జరిమానాగా కోత విధించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఇంద్రకీలాద్రిపై కుంకుమపూజలో పాల్గొన్న భక్తులు(ఇన్‌సెట్‌లో) ఆది దంపతుల నగరోత్సవం



మహిషాసుర మర్దిని అలంకారంలో పూజలందుకుంటున్న దుర్గమ్మ

జయ జయ హే

మహిషాసురమర్దిని



- ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న భవానీలు
- భవానీలతో ఎరుపెక్కిన ఆలయ పరిసరాలు
- పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ దేవస్థానం
- నేటి ఉదయం 11 గంటలకు మహా పూర్ణాహుతి
- సాయంత్రం హంస వాహనంపై తెప్పోత్సవం



అమ్మవారి దర్శనానికి వెళుతున్న భవానీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శ్రీమహిషాసురమర్దినీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మహిషాసురమర్దినీదేవి అలంకారం నేపథ్యంలో ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన ప్రత్యేక ఖడ్గమాలార్చన, ప్రత్యేక కుంకుమార్చన, ప్రత్యేక చండీయాగంతో పాటు శ్రీచక్రనవార్చనలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో రద్దీగా కనిపించాయి. బుధవారం ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు, యాత్రికులే క్యూలైన్‌లో అధికంగా కనిపించారు.

పెరిగిన భవానీలు..

అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, భవానీలు తెల్లవారుజామున ఆలయం తెరవడంతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరో వైపున ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భవానీలు పాదయాత్రగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. రద్దీ నేపథ్యంలో అన్ని దర్శన టికెట్లు రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ముందుగానే ప్రకటించడంతో రూ.100, రూ.300 టికెట్ క్యూలైన్లలోనూ భక్తులు విచ్చేసి ఆలయానికి చేరుకున్నారు. సీతమ్మవారి పాదాలు, పద్మావతి ఘాట్, పున్నమి, భవానీ ఘాట్లలో భవానీల తాకిడి కనిపించింది. భవానీల పుణ్యస్నానాలతో నదీతీరం, ఆలయ పరిసరాలు ఎరుపు వర్ణాన్ని సంతరించుకున్నాయి. అమ్మ వారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలు అన్న ప్రసాదం స్వీకరించి, లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసి తిరిగి తమ స్వస్థలాలకు బయలుదేరారు.

పాదయాత్రగా ఇంద్రకీలాద్రికి...

రాజమండ్రి, అనకాపల్లి, రంపచోడవరం, విశాఖపట్నంలోని మన్యం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భవానీలు పాదయాత్ర చేసుకుంటూ ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయానికి చేరుకునేందుకు 5 రోజులు పట్టినట్లు వారు తెలిపారు. వర్షాలు, ఎండలు, చలికి సైతం తట్టుకుని అమ్మవారిపై భక్తితో ఏటా ఇలా పాదయాత్రగా వస్తుంటామని భవానీలు చెప్పారు. కొంతమంది భవానీల పాదాలకు బొబ్బలు రావడం, వాపులు కనిపించడంతో వారికి వీఐపీ క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు.

11 గంటలకు పూర్ణాహుతి

శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గత నెల 22వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి.
గురువారం ఉదయం 11 గంటలకు ఇంద్రకీలాద్రిపై యాగశాలలో మహా పూర్ణాహుతితో దీక్షలు పరిసమాప్తం కానున్నాయి. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుంది.

పూల పల్లకీపై ఆది దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు పూలపల్లకీపై ఇంద్రగిరి పురవీధుల్లో విహరించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద పూలతో అలంకరించిన పల్లకీపై శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, మంగళవాయిద్యాల నడమ భక్తజనుల జయజయధ్వానాల మధ్య నగరోత్సవం సాగింది. ఆది దంపతుల నగరోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. మహా మండపం, గోశాల, కనకదుర్గ నగర్, ఘాట్‌రోడ్డు మీదుగా నగరోత్సవం ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.

10వ రోజు ఆదాయం రూ.62.16 లక్షలు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలలో 10వ రోజైన బుధవారం దేవస్థానానికి రూ.62.16 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రానికి 85 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, 25,533 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశామని, 11,468 మంది భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు.
ఇక సింగిల్ లడ్డూ విక్రయం ద్వారా రూ.1.92 లక్షలు, ఆరు లడ్డూల ప్యాక్‌లను విక్రయించడం ద్వారా రూ.54.70 లక్షలు, ఆర్జిత సేవలు, ఇతర సేవల ద్వారా రూ.5.54 లక్షల మేర ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

దుర్గగుడిలో నేడు

- గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం(యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- ఉదయం11 గంటలకు మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి
- మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన
- సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్లు కృష్ణానదిలో హంసవాహన సేవ
- సాయంత్రం 6 గంటలకు పంచహారతుల సేవ
- రాత్రి 12 గంటల వరకు అమ్మవారి దర్శనం

నేటి అలంకారం

[redacted]



దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తారు. చెరకుగడను వామహస్తంతో ధరించి, దక్షిణ హస్తంతో అభయాన్ని ప్రసాదిస్తూ, శ్రీషోడశాక్షరీ మహామంత్ర స్వరూపిణిగా శ్రీచక్రరాజ అధిష్టాన దేవతగా వెలుగొందే శ్రీ రాజరాజేశ్వరీదేవిని దర్శించి, అర్చించడం వలన సర్వ శుభాలు కలుగుతాయి. దసరా ఉత్సవాల సంపూర్ణ పుణ్యాన్ని అందరికీ అందింపచేసే అపరాజితా దేవిగా, చల్లనితల్లిగా శ్రీ కనకదుర్గమ్మ శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనం ఇస్తుంది. అమ్మను సేవించి జీవితాన్ని ధన్యం చేసుకుందాం. సకల శుభాలు, విజయాలు శ్రీ అమ్మవారి దివ్య దర్శనం ద్వారానే మనకు లభిస్తాయి.

నేడు ఆది దంపతులకు హంసవాహనంపై తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆది దంపతులకు కృష్ణానదిలో హంసవాహనంపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది కృష్ణానదికి భారీ వరద పోటెత్తడంతో హంసవాహనంపై నదీ విహారంపై సందిగ్ధత నెలకొంది. ఒక వేళ హంస వాహనంపై నదీ విహారం సాధ్యం కాని పక్షంలో దుర్గాఘాట్‌లో హంస వాహనంపై ఆదిదంపతుల ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించి ముల్లోకాలకు గుర్తుగా హంసవాహనాన్ని మూడు పర్యాయాలు



ముందుకు వెనక్కి నడుపుతారని ఆలయ వైదిక కమిటీ పేర్కొంది.

క్లుప్తంగా

టిప్పర్‌ను ఢీకొన్న లారీ

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



చీరాల అర్బన్: మండల కేంద్రం చీరాల 216 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చెన్నై నుంచి నిజాంపట్నం వెళుతున్న లారీ ఎంవీఐ కార్యాలయం సమీపంలో ముందు వెళుతున్న టిప్పర్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ పఠాన్ సిరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతికష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

టీటీడీ కల్యాణ మండపం ప్రారంభం

పర్చూరు(చినగంజాం): పర్చూరు మండలంలో అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి బుధవారం ప్రారంభించారు. ఆయన వెంట శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఉన్నారు. మండలంలోని నూతలపాడు, తెలగపాలెం గ్రామాల్లో రూ.1.80 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతలపాడు గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.గ్లోరియా, ఉప కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ ఎస్.లవన్న పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో దసరా చేసుకోవాలి

ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్లటౌన్: ప్రజలు దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆకాంక్షించారు. విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి, జిల్లా ప్రజల జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, విజయాలను చేకూర్చాలన్నారు. దసరా వేడుకల నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో డ్రోన్‌లతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

ఆర్డీఓ టి.చంద్రశేఖర నాయుడు

చీరాల రూరల్: వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) టి.చంద్రశేఖర నాయుడు అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో 23 మంది వృద్ధులను ఘనంగా సత్కరించారు. ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు మాట్లాడుతూ మనకోసం- మన క్షేమం కోసం పెద్దలు వారి జీవితాలను పణంగా పెట్టి కొవ్వొత్తుల్లా కరిగిపోతారన్నారు. అటువంటి పెద్దలను మనం గౌరవించుకోవాలని, వారి సూచనలు సలహాలను పాటించి ముందుకెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమం కోసం అనేక చట్టాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. వృద్ధులను నిర్లక్ష్యం చేసిన 40 కేసులను ట్రిబ్యునల్ జడ్జిగా పరిష్కరించానని, వృద్ధులకు పోలీసు ప్రొటెక్షన్ కూడా ఇచ్చానని వివరించారు. వారిని సక్రమంగా చూడని పక్షంలో వీలునామా, గిఫ్ట్ డీడ్‌లు కూడా రద్దు చేసే అధికారం తన పరిధిలో ఉందని హెచ్చరించారు. ప్రతినిత్యం వృద్ధులు వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అనంతరం వాకర్స్ సభ్యులు ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, సీనియర్స్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగవీరభద్రాచారి, చింతా రమేష్, వీరాంజనేయులు, తిరుపతిరావు, ఎంఎస్. సుబ్బారావు, బదరీనాథ్, రమేష్, పూర్ణ, దరియాసాహెబ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓను సత్కరిస్తున్న వాకింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

పంట నష్టం అంచనాకు ప్రత్యేక బృందాలు

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

బాపట్ల: కృష్ణానది నీటి ప్రవాహంతో నీటిలో మునిగి దెబ్బతిన్న పంట నష్టం అంచనాకు బృందాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్డీఓ, భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు హెబిటేషన్, పునరావాస కేంద్రాల ఇన్‌చార్జిలతో బుధవారం రాత్రి జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో పంటలలో నీరు తగ్గిన వెంటనే ప్రతి 50 ఎకరాలకు ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కృష్ణా నది నీటి ప్రవాహం తగ్గు ముఖం పట్టిందని అయినా సంబంధిత అధికారులకు కేటాయించిన విధుల్లో ఉండాలన్నారు.

గేదెల దొంగకు దేహశుద్ధి

చీరాల అర్బన్: గేదెలు దొంగలించే ముఠాను బుధవారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చీరాల మండలం ఈపూరుపాలెంలో గేదెలను దొంగలిస్తున్నారు. దీంతో స్థానికులు గట్టి నిఘా ఉంచి బుధవారం తెల్లవారుజామున గేదెలను దొంగలించేందుకు వచ్చిన దాసరి నవీన్, వల్లపు కొర్నేలు, సాతుపాటి మధుప్రణవ్‌ను పట్టుకున్నారు. అయితే వీరిలో దాసరి నవీన్, వల్లపు కొర్నేలు పరారీ కాగా మధుప్రణవ్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఆరాధ్యుల వాసుబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి



నరసరావుపేటలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

నరసరావుపేట టౌన్: న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కరించి వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ మమత ప్రియ అన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు బుధవారం పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ కోటా తగ్గించింటంతో వైద్యులు నైపుణ్యాన్ని పెంచుకొనే అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ జీఓ నెం. 99 ద్వారా పీజీ ప్రవేశాల్లో 20 శాతం ఉన్న కోటాను 15 శాతానికి తగ్గించటమే కాకుండా కేవలం ఏడు బ్రాంచ్‌లకే పరిమితం చేయటం అన్యాయమన్నారు. సంఘ నాయకులు డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల నుంచి పదోన్నతులు లేక ఒకే హోదాలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం గిరిజన భత్యంగా మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. మొదట దీక్ష శిబిరం వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు హనుమకుమార్, రమ్య, జగన్‌నరసింహారెడ్డి, రాధా కృష్ణన్, ప్రదీప్, బాల అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏడు మండలాల్లో వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో స్వల్ప వర్షం పడింది. అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 2.4 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.2 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర 2.2, గుంటూరు తూర్పు 2.2, మంగళగిరి 1.4, పెదకాకాని 1, తెనాలి మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.